మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

బాపట్ల | గుంటూరు | పల్నాడు

శనివారం 6 జూన్ 2026 పేజీలు : 4

## పచ్చదనమే ప్రకృతి రక్షణకు ప్రాణాధారం

**మొక్కలు నాటితేనే భావితరాలకు భద్రమైన భవిష్యత్**

**న్యాయమూర్తి రేణుకలత**



వివరాలు 2లో..

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి . రేణుకలత పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బాపట్ల కోర్టు ఆవరణలో మొక్కలు నాటి, పచ్చదనం పెంపుదల ద్వారానే కాలుష్య నియంత్రణ సాధ్యమని పేర్కొన్నారు.

బాపట్ల రక్షణ న్యూస్





వివరాలు 2లో..

## దేవుడి డబ్బులపై దండెత్తిన

# దొంగలెవరు..?

## భక్తుల విశ్వాసాన్ని మింగేసిన అధికారులు..

- బాపట్లలో భగ్గుమంటున్న భక్తులు...
- సెల్ఫ్ చెక్కులతో ఈవో లక్షలు డ్రా....
- ఈవో పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఆలయ కమిటీ...
- ఎమ్మెల్యే కి చెప్పి పోలీసుల కంప్లైంట్ ఇవ్వాలని ఆలోచనలు కమిటీ సభ్యులు....
- బాపట్ల భావదేవుని, శివాలయ నిధులపై కలకలం...

**"దేవుడి డబ్బులు దోచుకున్న చేతులకు శిక్ష ఎప్పుడూ..?"**

హుండీలో పడిన ప్రతి రూపాయి భక్తుల నమ్మకం. అలాంటి పవిత్ర నిధులను మింగేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, ఒక్క పైసా కూడా వదలకుండా రికవరీ చేయాలంటూ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దేవాలయాల ఆస్తులను కాపాడాల్సిన అధికారులే ఇప్పుడు దేవుడి నిధులపై కన్నేయడం బాపట్లలో తీవ్ర కలకలం రేపుతోంది. భక్తులు, దాతలు విశ్వాసంతో సమర్పించిన లక్షల రూపాయల విరాళాలు లెక్కలు లేకుండా మాయం కావడం, సెల్ఫ్ చెక్కుల ద్వారా నిధులు డ్రా కావడం, ప్రశ్నిస్తే బాధ్యత తప్పించుకోవడం ఇప్పుడు పెద్ద దుమా రంగా మారింది. బాపట్ల భావదేవుని ఆలయం, శివాలయంలో జరిగినట్లు చెబుతున్న ఆర్థిక అక్రమాలపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా, దేవాలయ కమిటీలు పోలీసులను ఆశ్రయించే దిశగా అడుగులు వేస్తున్నాయి.

ఉమ్మడి జిల్లా రక్షణ బ్యూరో....

**"గుడి ఖజానా ఖాళీ... అధికారులు మౌనం!"**

లక్షల రూపాయలు సెల్ఫ్ చెక్కులతో డ్రా అయినా ఇప్పటికీ స్పష్టమైన లెక్కలు లేవు. దేవాలయ నిధుల మాయంపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి నిజాలు బయటపెట్టాలని దాతలు డిమాండ్ చేస్తున్నారు.

## మండుటెండలో ఎమ్మెల్యే సైకిల్ యాత్ర.

### పర్యావరణ చైతన్యానికి నరేంద్ర వర్మ వినూత్న సందేశం



వివరాలు 3లో..

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు మండు టెం డను సైతం లెక్కచేయకుండా 15 కిలోమీటర్లు సైకిల్ తొక్కి పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక సందేశం ఇచ్చారు. వెదుళ్ళపల్లి బధిరుల ఆశ్రమ పాఠశాలలో మొక్కలు నాటి, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా పచ్చదన పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

బాపట్ల రక్షణ న్యూస్

## నేరాల నియంత్రణపై ఎస్పీ ఫోకస్

### బాపట్ల డీఎస్పీ కార్యాలయంపై ఆకస్మిక తనిఖీ



వివరాలు 3లో..

బాపట్ల జిల్లా పోలీస్ వ్యవస్థ పనితీరుపై జిల్లా ఎస్పీ డీ. ఉమామహేశ్వర ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం బాపట్ల డీఎస్పీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, నేరాల నియంత్రణ, శాంతి భద్రతలు, పెండింగ్ కేసుల దర్యాప్తుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, రాత్రి గస్తీ మరింత ముమ్మ రం చేయాలని ఆదేశించారు.

బాపట్ల రక్షణ క్రైమ్ న్యూస్

## పచ్చదనమే ప్రకృతి రక్షణకు ప్రాణాధారం

**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్లలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కోర్టు ఆవరణలో న్యాయ సేవా విభాగం ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి . రేణుకలత , బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు విన్నకోట సత్య ప్రసాద్ పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ న్యాయమూర్తి రేణుకలత మాట్లాడారు.ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, అడవుల నరికివేత వంటి సమస్యలు మానవ మనుగడకే ప్రమాదంగా మారుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. మొక్కలు పెంచడం ద్వారా గాలి కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు భూగర్భ జలాల పరిరక్షణకు కూడా తోడ్పాటు లభిస్తుందని తెలిపారు.పచ్చదనం పెంపొందితేనే ప్రకృతి సమతుల్యత కొనసాగుతుందని, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమని ఆమె పేర్కొన్నారు. కేవలం ఒక రోజు మొక్కలు నాటడం సరిపోదని, వాటిని సంరక్షించి పెద్ద చెట్లుగా పెంచాల్సిన బాధ్యత కూడా అందరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ ఒక సామాజిక బాధ్యతగా ప్రతి వ్యక్తి భావించాలని సూచించారు.ఈ సందర్భంగా బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు విన్నకోట సత్య ప్రసాద్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు న్యాయవాదులు కూడా తమ వంతు బాధ్యతగా మొక్కల పెంపకంలో భాగస్వాములు కావాలని తెలిపారు. కోర్టు ఆవరణను పచ్చదనంతో నింపేందుకు బార్ అసోసియేషన్ సభ్యులు కృషి చేస్తారని పేర్కొన్నారు.న్యాయ సేవా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాపట్ల బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు అవసరమని పలువురు అభిప్రాయపడ్డారు.

## ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలి



**కమిటీ చైర్మన్, సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన కన్నా లక్ష్మీనారాయణ**

**సత్తెనపల్లి, రక్షణ న్యూస్:**

శ్రీ మత్స్యావతార వేంకటేశ్వర స్వామి ఆలయం నూతన కమిటీ అభినందన సభ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ చైర్మన్, సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ ప్రతిష్టను మరింతగా పెంచే దిశగా కమిటీ సభ్యులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు.స్వామివారి సేవ చేసే అవకాశం లభించడం అదృష్ట మని, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని కమిటీకి సూచించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు.కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని, భవిష్యత్తులో కూడా ఆలయాల అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తామని కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు.రాష్ట్ర, జిల్లా, నియోజక వర్గ, మండల, గ్రామ స్థాయి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవుడి డబ్బులపై దండెత్తిన దొంగలెవరు..?

మొదటి పేజీ తరువాయి

**ఉమ్మడి జిల్లా రక్షణ బ్యూరో....**

దేవాలయం అంటే భక్తులకు కేవలం ఒక ప్రార్థనా స్థలం కాదు... అది నమ్మకం, భక్తి, ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీక. అలాంటి పవిత్ర ప్రదేశాల్లో భక్తులు సమర్పించిన ప్రతి రూపాయి దేవుడి సేవకే వినియోగమవుతుందనే నమ్మకంతో ప్రజలు విరాళాలు ఇస్తుంటారు. కానీ ఇప్పుడు అదే నిధులపై అక్రమాల ఆరోపణలు రావడం స్థానికులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తోంది. ముఖ్యంగా ఆలయాల పరిరక్షణ బాధ్యతలు చేపట్టిన అధికారులపైనే ఆరోపణలు రావడం మరింత సంచలనంగా మారింది. బాపట్లలోని భావదేవుని ఆలయం, శివాలయానికి సంబంధించిన ఖాతాల్లో భారీగా నగదు డ్రా అయినట్లు బయటపడటంతో భక్తులు, దాతలు షాక్‌కు గురయ్యారు. ఇప్పటివరకు లెక్కలు చెప్పకపోవడం, ప్రశ్నిస్తే సమాధానం లేకపోవడం అనుమానాలను మరింత పెంచుతోంది.

**సెల్ఫ్ చెక్కులతో రూ.11 లక్షల డ్రా..!**

బాపట్ల శివాలయ నిర్మాణం కోసం స్థానిక భక్తులు, దాతలు ఎంతో భక్తిశ్రద్ధలతో విరాళాలు అందించారు. మొత్తం దాదాపు రూ.28 లక్షలు ఆలయ ఖాతాలో జమ అయినట్లు రికార్డులు చెబుతున్నాయి. నిర్మాణ పనుల నిమిత్తం సుమారు రూ.15 లక్షలు కాంట్రాక్టర్లకు చెల్లించినట్లు లెక్కలు చూపిస్తున్నారు. అయితే మిగిలిన నిధుల్లో కేవలం లక్ష రూపాయలు మాత్రమే బ్యాంకు ఖాతాలో ఉండగా, దాదాపు రూ.11 లక్షలు సెల్ఫ్ చెక్కుల ద్వారా డ్రా అయినట్లు బ్యాంకు స్టేట్మెంట్లు వెల్లడించాయి.

ఈ వ్యవహారం ఆలస్యంగా బయటపడటంతో దేవాలయ కమిటీ సభ్యులు అవాక్కయ్యారు. ఆలయ నిర్మాణం ఇంకా పూర్తి కాకుండానే నిధులు ఖాళీ కావడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యంగా ఒక్కొక్కటిగా సెల్ఫ్ చెక్కులు వేసి నగదు డ్రా చేయడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. దేవుడి పేరుతో వచ్చిన నిధులు నిజంగా నిర్మాణ పనులకే వినియోగించారా..? లేక వ్యక్తిగత అవసరాలకు మళ్లించారా..? అన్న అనుమానాలు భక్తుల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీస్తున్నాయి.

**లెక్కలు అడిగితే బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నమా..?**

గత కొద్ది రోజుల క్రితం ఆలయానికి కొత్త ఈవో బాధ్యతలు చేపట్టిన తర్వాత పాత లెక్కలపై ఆరా తీసినట్లు సమాచారం. ఈ క్రమంలో దేవాలయ చైర్మన్, కార్యదర్శులు బ్యాంకుకు వెళ్లి ఖాతాల స్టేట్మెంట్లు పరిశీలించగా భారీగా నగదు డ్రా అయిన విషయం బయటపడింది. దీంతో మాజీ ఈవో వెంకటేశ్వరరావును సంప్రదించేందుకు పలుమార్లు ప్రయత్నించినప్పటికీ ఆయన అందుబాటులోకి రాలేదని చెబుతున్నారు.చివరకు స్పందించిన ఆయన, “నేను బదిలీపై వెళ్లిపోయాను... ఇకపై కొత్త ఈవోనే బాధ్యుడు” అని చెప్పినట్లు సమాచారం. ఈ సమాధానం ఇప్పుడు మరింత వివాదానికి దారితీస్తోంది. నిధులు డ్రా చేసిన సమయంలో బాధ్యతలు నిర్వహించిన అధికారి సమాధానం చెప్పకుండా తప్పించుకోవడం అనుమానాలను మరింత బలపరుస్తోంది. ఆలయ నిధుల వినియోగానికి సంబంధించిన బిల్లులు, రశీదులు, పనుల వివరాలు ఇప్పటివరకు పూర్తిగా అందించలేదని కమిటీ సభ్యులు చెబుతున్నారు. దీంతో ఇది సాధారణ లెక్కల గందరగోళమా...? లేక ప్రణాళికాబద్ధమైన ఆర్థిక అక్రమమా...? అన్న చర్చ మొదలైంది.

**భావదేవుని ఆలయంలోనూ అదే తంతు..?**

శివాలయం వ్యవహారం బయటపడుతుండగానే బాపట్ల భావదేవుని ఆలయంలో కూడా భారీ అవినీతి జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్కడ కూడా ఆలయ నిధులకు సంబంధించి సరైన లెక్కలు లేవని కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. భక్తులు ఇచ్చిన విరాళాలు, ప్రత్యేక పూజల ఆదాయం, ఇతర నిధుల వినియోగంపై స్పష్టత లేకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇటీవల కొన్ని లక్షల రూపాయలు డ్రా చేసినట్లు సమాచారం ఉన్నప్పటికీ వాటికి సంబంధించిన పూర్తి వివరాలు లభించలేదని చెబుతున్నారు. ఈవో వెంకటేశ్వరరావు భావదేవుని ఆలయానికి సంబంధించిన ఖాతాలను కూడా పూర్తిగా అప్పగించకుండానే వెళ్లిపోయినట్లు సమాచారం. దీంతో రెండు దేవాలయాల్లోనూ ఒకే తరహా అక్రమాలు జరిగాయా అనే అనుమానం మరింత బలపడుతోంది.స్థానిక భక్తులు మాత్రం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. “దేవుడికి ఇచ్చిన డబ్బు కూడా సురక్షితంగా లేకపోతే ఇక ప్రజలు ఎవరిని నమ్మాలి..?” అని ప్రశ్నిస్తున్నారు. భక్తుల విశ్వాసంతో వచ్చిన నిధులను అక్రమంగా వినియోగిస్తే అది కేవలం ఆర్థిక నేరం మాత్రమే కాదని, దేవాలయ పవిత్రతను దెబ్బతీసే చర్య అని మండిపడుతున్నారు.

**పోలీసు ఫిర్యాదుకు సిద్ధం... ఎమ్మెల్యే వైపు చూపులు...**

ఈ వ్యవహారంపై ఇప్పటికే దేవాలయ కమిటీ సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం స్థానికుల్లో అసంతృప్తిని పెంచుతోంది. దీంతో త్వరలోనే పోలీసులను ఆశ్రయించి అధికారిక ఫిర్యాదు చేయాలని కమిటీ సభ్యులు నిర్ణయించినట్లు తెలుస్తోంది.మరోవైపు దేవాలయ చైర్మన్, కార్యదర్శులు, కొంతమంది దాతలు కలిసి ఎమ్మెల్యే నరేంద్ర వర్మను సంప్రదించినట్లు సమాచారం. పోయిన నిధులను ఎలా రాబట్టాలి..? బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలి..? అనే అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో రాజకీయంగా కూడా చర్చ మొదలైంది. దేవాలయ నిధుల విషయంలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోతే భక్తుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.ఇప్పటికైనా ఉన్నతాధికారులు పూర్తి స్థాయి విచారణ జరిపి నిజాలు బయటపెట్టాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఎవరు ఎంత మొత్తాన్ని డ్రా చేశారు..? ఆ డబ్బు ఎక్కడ వినియోగించారు..? సంబంధిత బిల్లులు, రశీదులు ఉన్నాయా..? అనే అంశాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరుతున్నారు. దేవుడి నిధులపై చెయ్యేసిన వారెవ్వరైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.దేవాలయాలు ప్రజల విశ్వాసానికి ప్రతీకలు. అలాంటి పవిత్ర స్థలాల్లో అక్రమాలు జరిగితే అది కేవలం ఒక దేవాలయ సమస్య కాదు... సమాజ నైతిక విలువలకే మచ్చగా మారుతుంది. ఇకనైనా దేవాలయ నిధుల నిర్వహణలో పారదర్శకత తీసుకురాకపోతే ఇలాంటి ఘటనలు మరింత పెరిగే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

## నిబంధనలు ఉల్లంఘించిన ట్రావెల్స్ బస్సు సీజ్

**అత్యవసర ద్వారం ప్రమాణాలకు విరుద్ధంగా ఏర్పాటు చేసినట్లు గుర్తింపు**

**గుంటూరు, రక్షణ న్యూస్:**

నిబంధనలకు అనుగుణంగా లేని ప్రైవేటు ట్రావెల్స్ బస్సును సీజ్ చేసినట్లు రవాణా శాఖ ఉప కమిషనర్ కె. సీతారామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వివరాలు వెల్లడించారు.జబర్ ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన కెఏ--01--ఏఎస్--8804 నంబరు గల బస్సులో నిబంధనలకు విరుద్ధంగా అత్యవసర ద్వారాన్ని ఏర్పాటు చేసినట్లు తనిఖీల్లో గుర్తించినట్లు తెలిపారు.




ప్రయాణికుల భద్రతకు సంబంధించిన ప్రమాణాలను పాటించకపోవడంతో బస్సును సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.ప్రయాణికుల భద్రత విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయని, వాటిని తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుందని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు.బస్సుల నాణ్యతా ప్రమాణాలు, భద్రతా ఏర్పాట్లను నిరంతరం తనిఖీ చేస్తూ రవాణా శాఖకు సహకరిస్తున్న అధికారులను ఈ సందర్భంగా ఉప కమిషనర్ అభినందించారు.

# మండుటెండలో ఎమ్మెల్యే సైకిల్ యాత్ర...

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల రక్షణ న్యూస్**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్ల నియోజకవర్గంలో గురువారం నిర్వహించిన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన పర్యావరణ పరిరక్షణ పిలుపుతో ప్రేరణ పొందిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు వినూత్న రీతిలో పర్యావరణ చైతన్య యాత్ర చేపట్టారు.మండుతున్న ఎండలను కూడా లెక్కచేయకుండా తన నివాసం నుంచి సుమారు 15 కిలోమీటర్ల దూరం వరకు సైకిల్‌పై ప్రయాణించారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ఈ యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. దారి పొడవునా స్థానికులు ఎమ్మెల్యేకు అభివాదం చేస్తూ ప్రోత్సాహం అందించారు.సైకిల్ యాత్ర అనంతరం బాపట్ల మండలం వెదుళ్ళపల్లి గ్రామంలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలకు చేరుకున్న ఎమ్మెల్యే అక్కడ ఏర్పాటు చేసిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి స్వయంగా మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటిస్తూ పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మాట్లాడుతూ, రాబోయే తరాలకు ఇవ్వాల్సిన అసలైన ఆస్తి స్వచ్ఛమైన గాలి, నీరు, కాలుష్యం లేని వాతావరణమని పేర్కొన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న భూతాపం, అధిక ఉష్ణోగ్రతలు, సకాలంలో వర్షాలు పడకపోవడానికి అడవుల నరికివేత ప్రధాన కారణమని అన్నారు. భూతాపాన్ని తగ్గించాలంటే పెద్ద ఎత్తున మొక్కలు నాటడమే మార్గమని స్పష్టం చేశారు.ప్రతి ఒక్కరూ జీవితంలో జరిగే ప్రతి శుభకార్యాన్ని పురస్కరించుకుని కనీసం ఒక మొక్కనైనా నాటాలని ఆయన సూచించారు. నాటడమే కాకుండా ఆ మొక్క పెద్ద వృక్షంగా ఎదిగే వరకు సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని అన్నారు. పర్యావరణ దినోత్సవం రోజుకే పరిమితం కాకుండా ప్రతిరోజూ ప్రకృతి పరిరక్షణపై శ్రద్ధ చూపాలని పిలుపునిచ్చారు.వెదుళ్ళపల్లి బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటడం తనకు ప్రత్యేక ఆనందాన్ని కలిగించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ చిన్నారుల్లో ఉన్న పర్యావరణ స్పృహ సమాజానికి ఆదర్శమని కొనియాడారు. బాపట్ల నియోజకవర్గాన్ని పచ్చని, పరిశుభ్రమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే చేపట్టిన సైకిల్ యాత్ర, మొక్కల నాటే కార్యక్రమం స్థానిక ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై కొత్త చైతన్యాన్ని నింపింది.

# నేరాల నియంత్రణపై ఎస్పీ ఫోకస్

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల రక్షణ క్రైమ్ న్యూస్**

బాపట్ల సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ వివిధ అంశాలపై అధికారులతో చర్చించారు. ముఖ్యంగా సబ్ డివిజన్ పరిధిలో ఇటీవల నమోదవుతున్న నేరాల సరళి, వాటి వెనుక ఉన్న కారణాలు, తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ప్రాంతాలవారీగా జరుగుతున్న నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

**అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు...** శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులపై ఎలాంటి రాజీ లేకుండా వ్యవహరించాలని ఎస్పీ అధికారులకు స్పష్టం చేశారు. నేరాల నియంత్రణలో ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని, నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు.రాత్రి సమయాల్లో గస్తీని మరింత కట్టుదిట్టం చేయాలని, అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రజల్లో భద్రతాభావం పెరిగేలా పోలీసింగ్ ఉండాలని, ప్రతి ఘటనపై వేగంగా స్పందించాలని పేర్కొన్నారు.పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ సూచించారు. కేసుల విచారణలో నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు.

**ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండాలి...** ప్రజలకు పోలీసులు మరింత చేరువ కావాలని ఎస్పీ ఉమామహేశ్వర్ సూచించారు. ఫిర్యాదు కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెంచేలా పని చేయాలని చెప్పారు.ప్రతి సమస్యను సున్నితంగా పరిశీలించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలని సూచించారు.

**హెల్మెట్‌పై అవగాహన పెంచాలి...** 'శిరోరక్ష - ప్రాణ రక్ష' కార్యక్రమంపై కూడా ఎస్పీ ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.పోలీసులు చలానాలు విధిస్తారనే భయంతో కాకుండా, స్వచ్ఛందంగా ప్రజలు హెల్మెట్ ధరించేలా చైతన్యం తీసుకురావాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం తగ్గించేందుకు హెల్మెట్ వినియోగం అత్యంత కీలకమని వివరించారు.హెల్మెట్ ధరించని వారిపై చట్టపరమైన చర్యలతో పాటు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించాలని తెలిపారు. యువతలో ట్రాఫిక్ నిబంధనలపై బాధ్యత పెంచేలా ప్రత్యేక ప్రచారాలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ చంద్రమౌళి , బాపట్ల పట్టణ సీఐ రాంబాబు , రూరల్ సీఐ ప్రభాకర్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వేసవి శిక్షణా తరగతుల ముగింపు సభ ఘనంగా

## 40 రోజుల శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు




**గుంటూరు, రక్షణ న్యూస్:**

ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణా తరగతుల ముగింపు సభ జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో ఘనంగా జరిగింది. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ శ్రీమతి భీమనేని వందనా దేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఏప్రిల్ 28 నుంచి జూన్ 6 వరకు నిర్వహించిన వేసవి శిక్షణా తరగతుల్లో విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ భీమనేని వందనా దేవి మాట్లాడుతూ 40 రోజుల పాటు నిరంతరంగా నిర్వహించిన శిక్షణా శిబిరాలను విజయవంతం చేసిన రిసోర్స్ పర్సన్స్, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.వేసవి శిక్షణా తరగతులు, వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమొంటోలు, బహుమతులను అందజేశారు. గుళ్లపల్లి సేవా సమస్త వారి సహకారంతో ఈ బహుమతుల ప్రదానం నిర్వహించారు.ఉప గ్రంథపాలకురాలు కె. ఝాన్సీ లక్ష్మి ధన్యవాదాలు తెలియజేసి సమావేశాన్ని ముగించారు.ఈ కార్యక్రమంలో గుళ్లపల్లి సుబ్బారావు, కన్నా మాస్టారు, విద్య ఫౌండేషన్‌కు చెందిన బీవీకే ప్రసాద్, కే. ఆంజనేయులు, యేసురత్నం, వ్యాఖ్యాత సుజాత, రిసోర్స్ పర్సన్స్, ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్రీమతి వంకదారి సుబ్బరత్నమ్మ, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

## అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలి

**అమృతలూరు, రక్షణ న్యూస్:**

పీజీఆర్ఎస్‌లో ప్రజలు అందజేసే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. వన్ మంత్ ఫోర్ విజిట్స్ కార్యక్రమంలో భాగంగా అమృతలూరులో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆయన స్థానిక ఎమ్మెల్యే నక్క ఆనందబాబుతో కలిసి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత కలెక్టర్ల సదస్సులో నియోజకవర్గాల వారీగా పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో తొలిసారిగా వేమూరు నియోజక వర్గంలోని వేమూరు, కొల్లూరు, అమృతలూరు మండలాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.స్వీకరించిన ప్రతి అర్జీని సంబంధిత శాఖ అధికారులకు వెంటనే అందజేస్తామని, అధికారులు అదే రోజు క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యను పరిశీలించి పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదన్నారు.




**అర్జీదారుల వద్దకే వెళ్లాలి..** ఎమ్మెల్యే నక్క ఆనందబాబు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం అధికారులు ప్రజల వద్దకే వెళ్లి అర్జీలను పరిశీలించాలని సూచించారు. సమస్య పరిష్కారం కాకుండానే పరిష్కరించినట్లు నమోదు చేసే విధానాన్ని సహించబోమన్నారు. అటువంటి ఘటనలు పునరావృతమైతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నెల రోజుల పాటు ఒకే నియోజకవర్గంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహించి ప్రజా సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. వేమూరు నియోజకవర్గంలో వచ్చిన అర్జీలు తక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ వాటిని పూర్తిగా పరిష్కరించి మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

**పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కల నాటకం...**

అంతకుముందు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ మొక్కలు నాటి నీరు పోశారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, డివిజన్, మండల స్థాయి అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా హాసిని బాధ్యతలు



బాపట్ల రక్షణ న్యూస్...

బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా మామిళ్ళపల్లి హాసిని నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన బాధ్యతలు స్వీకరించిన హాసినికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, ప్రజా సమస్యల పరిష్కారంలో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో అధికారులు కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు పారదర్శక సేవలు అందించేందుకు కృషి చేస్తానని మామిళ్ళపల్లి హాసిని తెలిపారు.

# పాఠశాలలను 'నెట్ జీరో' కేంద్రాలుగా తీర్చిదిద్దాలి

## వ్యర్థాల నియంత్రణ.. హరిత ఇంధన వినియోగమే లక్ష్యం

## ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో ఇంచార్జి కలెక్టర్ సంజన సింహ పిలుపు



పల్నాడు, రక్షణ న్యూస్, జూన్ 5:

పర్యావరణ పరిరక్షణలో భాగంగా జిల్లా లోని అన్ని విద్యాసంస్థలను కార్బన్ ఉద్గా రాల రహిత, శూన్య వ్యర్థాల 'నెట్ జీరో' పాఠశాలలుగా తీర్చిదిద్దాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ సంజన సింహ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పెద్దతురకపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'నెట్ జీరో' లక్ష్య సాధనకు ప్రతి పాఠశాలలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. విద్యుత్ వినియోగాన్ని క్రమబద్ధీకరించడంతో పాటు పర్యావరణానికి హాని కలిగించే వ్యర్థాలను తగ్గించే చర్యలు చేపట్టాలన్నారు. తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి సేంద్రియ ఎరువుల తయారీకి వినియోగించాలని సూచించారు. ఇంకుడు గుంతల నిర్మాణం, ద్రవ వ్యర్థాల నిర్వహణ, హరిత ఇంధన వినియోగం వంటి చర్యలను విస్తృతంగా అమలు చేయాలని తెలిపారు. పాఠశాల ఆవరణల్లో పెద్దఎత్తున మొక్కలు నాటి దట్టమైన హరిత వనాలను అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సూచించారు.

# జూన్ 7 నుంచి గ్రామ స్థాయిలో యోగా పోటీలు

గుంటూరు, రక్షణ న్యూస్, జూన్ 5:

అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల నేపథ్యంలో జిల్లాలో జూన్ 7 నుంచి 20వ తేదీ వరకు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో యోగా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయి కాంత్ వర్మ తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పోటీల షెడ్యూల్‌ను వెల్లడించారు. జూన్ 7 నుంచి 9 వరకు గ్రామ/వార్డు స్థాయిలో, జూన్ 10 నుంచి 12 వరకు మండల స్థాయిలో, జూన్ 14 నుంచి 16 వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 18 నుంచి 20 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. వ్యక్తిగత, బృంద మరియు జ్ఞాన ఆధారిత విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసనాల ప్రదర్శన, ప్రాణాయామం, యోగా క్విజ్, వ్యాసరచన, నినాదాల పోటీలు ఇందులో భాగమని వివరించారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని పార్కులు, పాఠశాలలు, క్రీడా మైదానాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 21న అమరావతి వెస్ట్రన్ బైపాస్ రోడ్డుపై రాష్ట్ర స్థాయి అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 'యోగాంధ్ర-2026' పేరుతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది Yoga for Healthy Aging నినాదంతో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యోగాను ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, అన్ని వర్గాల ప్రజలు యోగాను అలవర్చుకోవాలని సూచించారు. జిల్లాలో ఉండవల్లి గుహలు, మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం తదితర ప్రాంతాల్లో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యోగం భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని, ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు యోగా ప్రయోజనాలను గుర్తించి జీవనశైలిలో భాగంగా చేసుకుంటున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో నిర్వహించే యోగా కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.




# తెలుగు వర్చువల్ అకాడమీకి డీపీఆర్ సిద్ధం

## భాషాభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలి


## ప్రైవేట్ కళాశాలలు అకాడమీ పుస్తకాలు కొనుగోలు చేయాలి

అమరావతి, రక్షణ న్యూస్:

తమిళనాడు తరహాలో తెలుగు వర్చువల్ అకాడమీ ఏర్పాటు కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసినట్లు తెలుగు మరియు సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ (శరత్ చంద్ర) తెలిపారు. శుక్రవారం వడ్డేశ్వరంలోని అకాడమీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమిళనాడు ప్రభుత్వం 45 దేశాల్లో తమిళ భాషను బోధిస్తున్న నమూనాను అధ్యయనం చేసి తెలుగు భాషను ప్రపంచవ్యాప్తంగా విస్తరించేందుకు వర్చువల్ అకాడమీ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. దీనికి సంబంధించిన డీపీఆర్‌ను మంత్రి నారా లోకేష్‌కు సమర్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావాలంటే తొలి దశలో కనీసం రూ.100 కోట్లు కేటాయించాలని కోరినట్లు వెల్లడించారు.

**అకాడమీ పుస్తకాలకు ప్రాధాన్యం ఇవ్వాలి...** ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం అకాడమీ ముద్రించిన పుస్తకాలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు అకాడమీ పుస్తకాలను కొనుగోలు చేయకపోవడం వల్ల సంస్థకు నష్టం కలుగుతోందన్నారు. ముఖ్యంగా చైతన్య, నారాయణ, బాష్యం వంటి విద్యాసంస్థలు విద్యార్థులు అకాడమీ పుస్తకాలను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**పైరసీపై కఠిన చర్యలు...** అకాడమీ కంటెంట్‌ను అనుమతి లేకుండా వినియోగించడం కాపీరైట్ ఉల్లంఘన కిందకు వస్తుందని హెచ్చరించారు.



అకాడమీ కంటెంట్‌ను ఉపయోగిస్తున్న ప్రైవేట్ సంస్థలపై అవసరమైతే కఠిన చర్యలకు సిఫారసు చేస్తామని తెలిపారు.

**యోజన తరహాలో మాసపత్రిక...** విద్య, విజ్ఞాన శాస్త్రం, సాహిత్యం, మహిళా సాధికారత అంశాలతో కేంద్ర ప్రభుత్వ 'యోజన' మాసపత్రిక తరహాలో త్వరలో ప్రత్యేక మ్యాగజైన్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు.

**పోస్టుల భర్తీకి చర్యలు...** అకాడమీలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు లేఖ రాసినట్లు చెప్పారు. ఏపీపీఎస్సీ ఆలస్యం చేస్తే ఇతర ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా నియామకాలు చేపట్టాలని కోరినట్లు వివరించారు.

**సంస్కృత అకాడమీకి స్థలం...** తిరుపతిని కేంద్రంగా సంస్కృత అకాడమీని అభివృద్ధి చేయాలని భావిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం తిరుమలలో ఐదు ఎకరాల స్థలం కేటాయించాలని టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడును కోరినట్లు చెప్పారు. సంస్కృత భాషాభివృద్ధికి టీటీడీ నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

**అకాడమీ భవనానికి రెండు ఎకరాలు...** తెలుగు అకాడమీ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణం కోసం సీఆర్‌డీఏ పరిధిలో రెండు ఎకరాల స్థలం కోరినట్లు తెలిపారు. ప్రభుత్వం స్థలం కేటాయిస్తే అకాడమీ నిధులతో భవన నిర్మాణం చేపడతామని వెల్లడించారు.

# టీడీపీ నూతన కార్యాలయ నిర్మాణ పనుల పరిశీలన

## బాపట్ల పార్లమెంట్ కార్యాలయ నిర్మాణ పురోగతిపై ఎమ్మెల్యే నరేంద్ర వర్మ సమీక్ష

బాపట్ల, రక్షణ న్యూస్:

బాపట్ల మండలం వెదుళ్లపల్లి జాతీయ రహదారి పక్కన నూతనంగా నిర్మిస్తున్న బాపట్ల పార్లమెంట్ తెలుగు దేశం పార్టీ కార్యాలయ భవన నిర్మాణ పనులను బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయ నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న ఆయన, పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత నిర్మాహకులకు సూచించారు. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉండేలా అన్ని సౌకర్యాలతో కార్యాలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. బాపట్ల పార్లమెంట్ పరిధిలో పార్టీ కార్యకలాపాల నిర్వహణకు ఈ కార్యాలయం కేంద్రంగా ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్క నాటాలి: డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

**ముండ్లమూరు, రక్షణ న్యూస్:**

భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించాలంటే పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని దర్శి తెలుగు దేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో జిల్లా కలెక్టర్ పి. రాజబాబుతో కలిసి ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన "అమ్మ పేరుతో ఒక మొక్క" పిలుపు స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ తల్లి, పిల్లల పేరుతో లేదా ప్రత్యేక సందర్భాల్లో మొక్కలు నాటాలని కోరారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ప్రకృతి వైపరీత్యాలు మానవాళికి హెచ్చరికలుగా మారాయని పేర్కొన్నారు. వాటిని ఎదుర్కోవాలంటే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి చెట్ల పెంపకానికి,



నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్క నాటి హరిత విప్లవంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరో గ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. రైతులు పొలాల్లో వ్యవసాయ వ్యర్థాలను తగలబెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాంటి ఘటనల వల్ల వాయు కాలుష్యంతో పాటు ప్రాణనష్టం కూడా సంభవిస్తోందని తెలిపారు. ఇటీవల పోలవరం గ్రామంలో జరిగిన విషాద ఘటనను గుర్తు చేస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు ముందుండి ప్రజలను చైతన్యవంతులను చేయాలని, మొక్కల పెంపకాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని పిలుపునిచ్చారు. అనంతరం నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి-సుబ్బారావు, డ్వామా పీడీ గంగవరపు జోసఫ్ కుమార్, డీఈవో, ఎంపీడీఓ, ఏపీవో, ఏఎంసీ వైస్ చైర్మన్ మస్తాన్‌రావు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, టీడీపీ నాయకులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

# పాఠశాల ఆవరణలో పెద్దఎత్తున మొక్కలు నాటాలి

## 'నెట్ జీరో' పాఠశాలలుగా విద్యాసంస్థలను తీర్చిదిద్దాలి

**గుంటూరు, రక్షణ న్యూస్:**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా జిల్లాలోని విద్యాసంస్థలను కార్బన్ ఉద్గారాల రహిత, శూన్య వ్యర్థాల 'నెట్ జీరో' పాఠశాలలుగా తీర్చిదిద్దాలని సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎం.ఎం. నాయక్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తాడికొండలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'నెట్ జీరో' లక్ష్య సాధన దిశగా అన్ని పాఠశాలల్లో విద్యుత్ వినియోగాన్ని క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే చెత్త, వ్యర్థాలు చేరకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా సేకరించడం, సేంద్రియ ఎరువుల తయారీ, ఇంకుడు గుంతల నిర్మాణం, ద్రవ వ్యర్థాల నిర్వహణ, హరిత ఇంధన వినియోగం వంటి పద్ధతులను అలవర్చుకోవాలని సూచించారు. పాఠశాల ఆవరణల్లో పెద్దఎత్తున మొక్కలు నాటి వాటిని చిన్న అడవులుగా తీర్చిదిద్దాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగం, గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాల కారణంగా పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని తెలిపారు. కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాల పెరుగుదల వల్ల ఉష్ణోగ్రతలు అధికమై ఎల్‌నినో వంటి ప్రతికూల ప్రభావాలు



ఏర్పడుతున్నాయని వివరించారు.

### గురుకులాల్లో 'నెట్ జీరో' అమలు

ఏపీ గురుకుల పాఠశాలల కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నెట్ జీరో' భావనను గురుకుల పాఠశాలల్లో అమలు చేస్తున్నామని తెలిపారు. సౌరశక్తి వినియోగం, వర్షపు నీటి సంరక్షణ, గ్రీన్ హౌస్ వాయువుల తగ్గింపు వంటి అంశాలను విద్యార్థులకు ప్రాయోగికంగా అర్థమయ్యేలా బోధిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ఇన్‌చార్జి డీటీడబ్ల్యూవో డి. దుర్గాభాయి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి. శంకర్, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగసాయి కుమార్, గురుకులం ప్రధానాచార్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సైకిల్ వినియోగంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యం

### ప్రతి ఇంటి ముందు ఒక మొక్క నాటాలి: ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు

**పెదనందిపాడు, రక్షణ న్యూస్:**

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రత్తిపాడు ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదనందిపాడులో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి ఆయన సైకిల్‌పై విచ్చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విశాఖపట్నంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన సైకిల్ ర్యాలీ స్ఫూర్తితో ఈ కార్యక్రమానికి సైకిల్‌పై వచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి పెదనందిపాడు వీధుల్లో సైకిల్ ర్యాలీ నిర్వహించి పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన



కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాహనాల వినియోగం పెరగడం వల్ల కాలుష్యం అధికమవుతోందని, దాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ వారానికి కనీసం ఒక రోజు సైకిల్‌ను వినియోగించాలని సూచించారు. దీంతో పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్య సంరక్షణ కూడా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఇంటి ముందు, ప్రతి వీధిలో ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. చెట్ల పెంపకం వల్ల వర్షపాతం పెరగడంతో పాటు ఉష్ణోగ్రతలు తగ్గుతాయని చెప్పారు. భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## బాలికల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### కిషోరి బాలికా వికాసం కార్యక్రమంలో అవగాహన



**ముండ్లమూరు, రక్షణ న్యూస్:**

ముండ్లమూరు మండలం లోని మారెళ్ళ గ్రామం లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిషోరి బాలికా వికాసం కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికలు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకొని వాటిని పరిరక్షించుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో బాల్య వివాహాల నిరోధక చట్టం, టీనేజ్ గర్భధారణ వల్ల కలిగే అనర్థాలపై వివరంగా అవగాహన కల్పించారు. అలాగే మహిళల ఆరోగ్యం, పోషకాహారం, రుతుక్రమ పరిశుభ్రతకు సంబంధించిన అం శాలను వివరించారు. బాలికల భద్రత, సంక్షేమం కోసం కుటుంబ సభ్యులు, సమాజం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలికల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, ఏఎన్ఎం, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

## కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: కన్నా లక్ష్మీనారాయణ




**సత్తెనపల్లి, రక్షణ న్యూస్:**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్తెనపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు చెత్తను వేర్వేరుగా సేకరించి పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ డబ్బాల వినియోగాన్ని స్వచ్ఛందంగా తగ్గించి కాలుష్య నియంత్రణకు సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. కాల్వలు, చెరువులు, చెక్‌డ్యాంలను అభివృద్ధి చేసి నీటి నిల్వకు సిద్ధం చేయాలని, భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి వనరుల సంరక్షణ ద్వారానే భవిష్యత్ తరాలకు మెరుగైన వాతావరణాన్ని అందించగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, వార్డు స్థాయి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 6/6/2026 1:35 AM Page 6



# గుడ్డ సంచుల వినియోగంతో పర్యావరణ పరిరక్షణ

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గుడ్డ సంచుల పంపిణీ



**తాడేపల్లి, రక్షణ న్యూస్:**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తాడేపల్లి క్యాంపు కార్యాలయం సమీపంలో గుడ్డ సంచుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లపై ప్రయాణిస్తున్న ప్రజలు, వినియోగదార ులకు పర్యావరణ హిత గుడ్డ సంచులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని అన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతి వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ సంచులకు బదులుగా గుడ్డ సంచులను వినియోగించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబా బు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. చెట్ల పెంపకం, ప్లాస్టిక్ నిర్మూలన, పరిశుభ్రత కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. యువత పర్యావరణ పరిరక్షణలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో పర్యావరణ హిత అలవాట్లను అలవరచుకోవాలని, ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని పూర్తిగా మానేసి గుడ్డ సంచులను ఉపయోగించాలని కోరారు. స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుతో స్థిర ఆదాయం

## రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించిన సిరి సీడ్స్

**బల్లికురవ రక్షణ న్యూస్**

ప్రకాశం జిల్లా అద్దంకిలో సిరి సీడ్స్ ఆయిల్‌పామ్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు మండలాలకు చెందిన రైతులకు ఆయిల్‌పామ్ సాగు విధానాలు, దిగుబడి పెంపు పద్ధతులపై క్షేత్రస్థాయిలో వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బల్లికురవ మండలం నుంచి 35 మంది, అద్దంకి మండలం నుంచి 10 మంది రైతులను బెస్తవారిపేట మండలం గల్లిజరగుల్ల గ్రామంలోని ఆయిల్‌పామ్ రైతు వీబత్షుశ్రీఅ తోటకు తీసుకెళ్లారు. ఐదేళ్లుగా దిగుబడి ఇస్తున్న ఆయిల్‌పామ్ తోటను రైతులు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఆయిల్‌పామ్ సాగు పద్ధతులు, నిర్వహణ, దిగుబడి పెంచుకునే మెళకువలపై రైతు మురళిని అడిగి తెలుసుకున్నారు. నీటి వసతి ఉన్న భూములన్నీ ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలమని కంపెనీ ప్రతినిధులు వివరించారు. సిరి సీడ్స్ ప్రతినిధులు మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన ఆయిల్‌పామ్ మొక్కలను తమ నర్సరీ ద్వారా అందజేస్తామని తెలిపారు. మొదటి రెండు సంవత్సరాల్లో అంతర పంటల ద్వారా రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు ఆదాయం పొందవచ్చని చెప్పారు. నాలుగో సంవత్సరం నుంచి ఆయిల్‌పామ్ దిగుబడి ప్రారంభమవుతుందని, 30 సంవత్సరాల పాటు ప్రతి నెలా స్థిర ఆదాయం లభిస్తుందని వివరించారు. ఏడో సంవత్సరం నుంచి ఆయిల్‌పామ్‌తో పాటు అంతర పంటల ద్వారా ఏటా రూ.2 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిరి సీడ్స్ స్టేట్ హెడ్ ఎవఅఎెఫ్‌వంష్ట్ర, ఆయిల్‌పామ్ రైతు మురళి, మూడు మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించిన భవనాలకే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు

## అనధికార నిర్మాణాలపై కఠిన చర్యలు తప్పవు: కమిషనర్ మయూర్ అశోక్



**గుంటూరు, రక్షణ న్యూస్:**

ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, ప్రమాణాలను పూర్తిగా పాటించిన బహుళ అంతస్తుల భవనాలకు మాత్రమే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ స్పష్టం చేశారు. శుక్రవారం బ్రాడీపేట, ఎల్ఐసీ కాలనీ, పలకలూరు రోడ్, జేకేసీ కాలేజీ రోడ్, గోరంట్ల, రామిరెడ్డి నగర్, సంతోష్ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించారు. అలాగే నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా భవనాలు అనుమతించిన ప్లాన్‌కు అనుగుణంగా నిర్మించారా లేదా అనే అంశాన్ని పరిశీలించారు. పార్కింగ్ స్థలాలు, సెట్‌బ్యాక్స్, అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు, వర్షపు నీటి సంరక్షణ గుంతలు తదితర అంశాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి నిర్మించిన భవనాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు మంజూరు చేయవద్దని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు.

**అనధికార నిర్మాణాలకు అడ్డుకట్ట...**సచివాలయ పరిధిలో అనధికార లేదా అనుమతులకు భిన్నంగా నిర్మాణాలు జరగకుండా ప్రాథమిక దశలోనే చర్యలు తీసుకోవాలని ప్లానింగ్ కార్యదర్శులకు సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులు, పర్యవేక్షణ అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**నాణ్యతతో అభివృద్ధి పనులు....**నగరంలోని వివిధ డివిజన్లలో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైన్లు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్ నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. పనులు పూర్తయిన వెంటనే నిర్మాణ వ్యర్థాలను తొలగించి ప్రజలకు ఇబ్బందులు కలగ కుండా చూడాలని సూచించారు. అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి డ్రెయిన్లలో పూడికతీత పనులను నిరంతరం పర్యవేక్షించాలని ప్రజారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ రెహ్మాన్, డీఈఈ రమేష్‌బాబు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య శాఖ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



## 'ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు సందర్శనలు' కార్యక్రమానికి విశేష స్పందన

**పెదనందిపాడు, రక్షణ న్యూస్:**

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని జిల్లా కలెక్టర్ సి.యం. సాయి కాంత్ వర్మ అన్నారు. 'ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు సందర్శనలు' కార్యక్రమంలో భాగంగా పెదనందిపాడులో నిర్వహించిన ప్రజా అర్జీల స్వీకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులతో కలిసి పెదనందిపాడు, కాకుమాను మండలాలకు చెందిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు వాటిపై అవగాహన కల్పించేందుకు ఇది మంచి వేదికగా నిలుస్తుందన్నారు. ప్రజల వద్దకే ప్రభుత్వం వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని చెప్పారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీకి నాణ్యమైన, సంతృప్తికరమైన పరిష్కారం అందించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. జిల్లాలో కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో తొలిసారిగా ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఈ కార్యక్రమం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి మాట్లాడుతూ ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో 149 అర్జీలు స్వీకరించామని చెప్పారు. వాటిలో 115 రెవెన్యూకు సంబంధించినవని, ఇప్పటికే 26 అర్జీలను పరిష్కరించినట్లు వివరించారు. పొదుపు చర్యల్లో భాగంగా గుంటూరు నుంచి పెదనందిపాడుకు జిల్లా అధికారులు, సిబ్బంది ప్రయాణించేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెనాలి ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్ లక్ష్మీకుమారి, ఆర్డీవో కె. శ్రీనివాసరావు, రవాణా శాఖ ఉప కమిషనర్ కె. సీతారామిరెడ్డి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె. కళ్యాణ చక్రవర్తి, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎడ్ల భాస్కరరావు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. పద్మావతి, జిల్లా పౌర సరఫరాల అధికారి పి. కోమలి పద్మ, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి, ఇతర జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.